# శ్రావణంలో వర్షాలు లేవు

డా. రఘునాథరావు



"నీకు పుష్టిగా మత్తుమందు తాపి, నిన్ను బుట్టలో పెట్టి మా ఊరు తీసుకొని వెళ్ళాను. అంతా సవ్యంగానే జరిగింది. నీ అంతట నువ్వే బలిపీఠం ఎక్కావు. నీ మెడలో బలిదండ నువ్వే వేసుకున్నావు. నీ చేతితో నువ్వే కత్తి నా చేతిలో పెట్టావు. 'ఊఁ నరుకు, త్వరగా నరుకు! నేను స్వర్గానికి వెళతాను!' అన్నావు ..కాని..."

పరీక్షలై పోయాయి. ఒక్కొక్కరే హాస్టళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. మేం ముగ్గురం ఏదో సినిమా చూడడానికి పోయాం. సినిమా చూస్తున్నాం గాని మనస్సుల్లో ఉత్సాహం లేదు.

భాష తెలియని మహాపట్నంలో దారి వెతుక్కుంటున్న ప్రవాహంలాగు ఆందోళన పడుతున్నాయి మా మనస్సులు. తరవాత కార్యక్రమం ఏమిటి? పై చదువులకు వెళ్లడమా? ఏదైనా ఉద్యోగాలకి ప్రయత్నం చెయ్యడమా? లేక ముగ్గురం కలిసి ఏదైనా వ్యాపారం మొదలుపెట్టడమా? సాయంత్రమంతా చర్చించాం. సినిమా అయిపోయి హాస్టలుకి వస్తూ తోవలోకూడా చర్చిస్తూనే ఉన్నాం. హాస్టలులో రాత్రి డాబామీద పక్కలు వేసుకొని, కిళ్లీలు నములుతూ మళ్లీ ఈ ప్రసంగమే ఎత్తుకున్నాం. కాని, కెలిడస్కోపులోని గాజుముక్కలు అనేక రంగుల ఆకారాల్లో క్షణక్షణానికీ మారుతున్నట్టు మా ముగ్గురి ఆలోచనలు కలిసి అల్లిబిల్లిగా అయోమయమైన వేర్వేరు ఆకారాలుగా అల్లుకుంటున్నాయి. అలాగే మాట్లాడుకుంటూ ఎప్పుడో తెల్లవారుఝామున నిద్రపోయాం. నిద్ర లేచేసరికి బాగా పొద్దు పోయింది. ముఖం కడుక్కొని గడ్డం గీసుకుంటుంటే సుబ్రహ్మణ్యం హడావిడిగా గదిలోకి వచ్చాడు. వాడి చేతిలో ఒక ఉత్తరం ఉంది. గదిలోకి వస్తూనే,

"గురూ! ప్రమాదం వచ్చి పడింది" అని మంచంమీద కూలబడ్డాడు.

"ఏమయింది?" అన్నాను ఆత్రంగా. నా కేదో చెప్పబోయి, తటపటాయించి, చప్పున లేచాడు.

"ఇప్పుడు కాదు. గడ్డం కానీ తరవాత చెబుతాను" అని ఉత్తరాన్ని జేబులో పెట్టుకుంటూ, వణికిపోతూ ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు. గడ్డం గీసుకొని, బట్టలు తొడుక్కొని వరండాలోకి వచ్చాను. వాళ్లిద్దరూ నా కోసం ఎదురుచూస్తున్నారు. ముగ్గురం కలిసి ఓ హోటలుకి పోయి టిఫిన్ పట్టుకు రమ్మన్నాం.

"ఊఁ! ఇప్పుడు చెప్పు, ఆ కొంప లంటుకుంటున్న విషయం ఏమిటో?" అన్నాడు వెంకటరావు.

"ఓహో! నీతోకూడా చెప్పాడూ?" అన్నాను.

"చెప్పడమేమిటి? ఈ ఉత్తరం పొద్దున్న చేతిలోకి వచ్చిన దగ్గరనుంచి అంటించిన సిసింద్రీలాగు తిరుగుతున్నాడు."

"హోల్డాన్, హోల్డాన్" అన్నాడు రెండు చేతులూ మీది కెత్తి సుబ్రహ్మణ్యం. మే మిద్దరం కుతూహలంతో చెవులు రిక్కించాం.



ప్రార్థన
ఫోటో—ఎస్. ఎస్. రెడ్డి
(చెంబూర్—2)

సుబ్రహ్మణ్యం ఒక నిమిషం ఆగాడు. తరవాత కళ్లజోడు తీసి అనవసరంగా జాగ్రత్తగా తుడిచాడు. కళ్లజోడు పెట్టుకుంటూ పెళ్లికూతురులా సిగ్గుపడ్డాడు.

"మరేం లేదూ" అని మొదలుపెట్టి గొంతు ఓసారి సవరించుకున్నాడు. "ఈ ఉత్తరం మా నాన్న రాశాడు. తప్పు నాదే అనుకోండి. మీ ఇద్దరిని గురించి, మన స్నేహం గురించి అడపాతడపా అతనికి చెబుతూ ఉండేవాణ్ణి. కాని మీరూ, అతనూ కలుసుకోవడం ఎప్పుడూ జరగలేదు. అవును, మా రాజేశ్వరి చూడ్డానికి బాగుంటుంది. తెల్లగా, కోలముఖం అదీ. బి. ఎ. కి ఈ సంవత్సరం వెళ్లింది. మీకు ఇష్టమయితే ... అసలు ఇష్టమేమిటి? ఎలాగూ పరీక్ష లయిపోయాయికదా! మా ఇంట్లో కాస్త విశ్రాంతి తీసుకున్నట్టు అవుతుంది. మా నాన్న ఆలోచన బాగానే ఉంది. అయితే, మీ రసగలరు ఉద్యోగం లేనిదీ పెళ్లి పెడాకులూ ఎందుకని? కాని బలవంతం ఏమీ లేదుగా. పెళ్లి తరవాత చేసుకోవచ్చు. మిమ్మల్ని మా ఊరు తీసుకొని రమ్మన్నాడు. ఏమంటారు?" అని పూర్తిచేశాడు సుబ్రహ్మణ్యం. జేబురుమాలుతో మరుట పట్టిన చెమట తుడుచుకున్నాడు. బల్లమీద చేతివేళ్లతో టపటప కొడుతూ రోడ్డువైపు దీక్షగా చూశాడు.

మే మిద్దరం ఒకరి ముఖా లొకరం చూసుకున్నాం. వాడితో ఏమనాలో తోచక మేం తికమకపడుతూ ఉంటే, సర్వరు సమయానికి ఆదుకోడానికి వచ్చాడు. వాడు పెట్టిన ఫలహారం తింటూ ఎవ్వరం మాట్లాడలేదు. బిల్లు చెల్లించి రోడ్డుమీదికి వచ్చిన తరవాత "ఏదీ ఉత్తరం?" అన్నాడు వెంకటరావు. సుబ్రహ్మణ్యం జేబులోనించి ఉత్తరం తీసి ఇచ్చాడు. నేను కిళ్లీలు కట్టిస్తూంటే ఉత్తరం చదివాడు వెంకటరావు. ఉత్తరాన్ని తిరిగి ఇచ్చేసి నే నందించిన కిళ్లీ నములుతూ ఒక నిశ్చయానికి వచ్చాడు.

"చూడు, సుబ్బూ! పెళ్లిచూపుల సంగతెలా ఉన్నా మనం ముగ్గురం కలిసి ఇంకా కొన్ని రోజులు గడపడానికి ఇదో అవకాశం అనుకుందాం. ఈ విషయం అక్కడితో వదిలేయ్. ఏమంటావ్?" అన్నాడు.

"ఓ కే" అన్నాడు సుబ్రహ్మణ్యం విప్పారిన ముఖంతో. ఇద్దరూ నా వైపు చూశారు.

"మీ ఇద్దరితో కలిసి ఉండడాని కే నెప్పుడూ సిద్ధమే. కాని, పెళ్లి చూపులకి మాత్రం నేను రాను. మనలో మనకి దాపరికాలు ఎప్పుడూ లేవు కదా? అందుకే ముందుగానే చెప్పేస్తున్నాను, తరవాత ఏమీ అపోహలు రాకుండా" అన్నాను. ఇద్దరూ నా వైపు ప్రశ్నార్థకంగా చూశారు.

"సహాశః నేను మీకు చెప్పిన దాన్ని వివరిస్తే బాగుంటుంది" అన్నాను నేను. నా కిద్దరూ తలాడించారు.

"నేనో భగ్నప్రేమికుణ్ణి. తమాషాగా ఉంది కదూ? కాని, ఇది నిజం. వివరాలు అడక్కండి. అయితే మీ రసగలరు, 'జీవితంలో ఇటువంటి తక్కామొక్కీలు తగులుతూనే ఉంటాయి. తట్టుకోలేవా?' అని. తట్టుకోగలనని ధైర్యం ఉంది. కాని, ఈ దెబ్బ కాస్త గట్టిగానే తగిలింది. గాయం మానడానికి ఇంకా కొంతకాలం పడుతుం దనుకుంటాను" అన్నాను సిగరెట్టు దమ్ము గట్టిగా లాగుతూ.

"ఐ యామ్ సారీ" అన్నాడు సుబ్రహ్మణ్యం సానుభూతిగా, కళ్లజోడు తీసి రుమాలుతో తుడుచుకుంటూ.

"ఛట్. ఇందులో నువ్వు క్షమాపణ చెప్పుకోవడం దేనికి?" అన్నాను.

ఆ రోజే ముగ్గురం సుబ్రహ్మణ్యం ఊరికి ప్రయాణమయ్యాం. స్టేషన్‌కి వాళ్ల నాన్నగారు వచ్చారు. మా ఇద్దర్నీ పరిచయం చేశాడు సుబ్రహ్మణ్యం. వాళ్ల దొకడాబా ఇల్లు. ఆ పేట కొత్తగా అభివృద్ధి పొందుతున్నట్టుంది. వెడల్పాటి రోడ్లు, అన్ని ఇళ్లకి ప్రహారీ గోడలు...చూడ ముచ్చటగా ఉన్నాయి. స్నానాలు, భోజనాలు, మధ్యాహ్నం చిన్న కునుకు అయిన తరవాత సాయంత్రం అందరం తీరికగా కూర్చొని కాఫీ తాగుతూంటే, రాజేశ్వరిని హాల్లోకి తీసుకువచ్చి మాకు పరిచయం చేశారు వాళ్ల నాన్నగారు. ఆమె అందమైనదే. సుబ్రహ్మణ్యం చెప్పినదానిలో అతిశయోక్తి ఏమీ లేదు.

"సుబ్బూ! మీ చెల్లెలు కాబట్టి పొగుడుకున్నా వనుకున్నాను. కాని, ఈమె నిజంగా అందమైనదే" అన్నాను. రాజేశ్వరి సిగ్గుపడింది.

"వాయ్‌వాయ్! దా న్నట్టే పొగడకురోయ్. కొండెక్కి కూర్చుంటుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఒసేవ్, రాజీ! నీకు ముందే వార్నింగ్ ఇస్తున్నాను. ఎప్పుడో పొగడాడూ,

ఎర్రగా బుర్రగా ఉన్నాడూ అని వీడి వెనకాల పడేవు. జాగ్రత్త! మరి, వీడు దొరకడు. వీడో భగ్నప్రేమికుడు. వీ బాణాలన్నీ ఆ రెండోవాడిమీద విసురు. మనిషి కాస్త చామనచాయ అయినా మంచివాడు. పైగా, నీ కంటె రంగులో తక్కువ కాబట్టి నీకు గులామై నీ కొంగు పట్టుకొని తిరుగుతాడు. ఆపైన నీ ఇష్టం."

"ఫో, అన్నయ్యా!" అన్నది రాజేశ్వరి కోపముగా. సుబ్రహ్మణ్యం వెంకటరావు వైపు చూశాడు. వెంకటరావు కాఫీ కప్పుమీద దృష్టి కేంద్రీకరించాడు.

అందరం సాయంత్రం సినిమాకి వెళ్లాం. సినిమానించి వచ్చాక భోజనాలు చేసి పేకాట ఆడాం. రాజేశ్వరి పేకాట బాగా ఆడుతుంది. వారం రోజులు తిరిగేసరికి వెంకటరావు ఆమె ఆకర్షణలో పడ్డాడు. తరవాత అతడి తలిదండ్రులు వచ్చి ఆమెను చూసుకున్నారు. వాళ్లకి కూడా ఆమె నచ్చింది. పెళ్లి ముహూర్తం పెట్టుకొని వాళ్లు వెళ్లిపోయిన తరవాత ఒకనాటి రాత్రి అందరం డాబామీద విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు రాజేశ్వరి సుబ్రహ్మణ్యం చెవిలో ఏదో చెప్పింది.

సుబ్రహ్మణ్యం గట్టిగా, "నా చెవిలో ఎందుకూ? వాణ్ణే అడుగు" అన్నాడు నా వైపు చూస్తూ. ఆమె కోపం నటిస్తూ చేతిలో ఉన్న దిండుతో వాణ్ణి కొట్టింది.

"ఏమిటి అడగడం?" అన్నాను.

"అదే. మీ స్నేహితుడు భగ్న ప్రేమికుణ్ణి అని ముఖం ముడుచు కొని, రోజూ ఊరికే సిగరెట్లు తగలెడుతున్నాడు కదా? ఎవ రా సుందరి? ఏ మా కథ? అని అడుగు తూంది, కృష్ణా!" అన్నాడు కళ్లజోడు తుడుచుకుంటూ. నే నామెవైపు చూశాను.

"ఎందు కా కుతూహలం?" అన్నాను నవ్వుతూ.

"ఆడదాన్ని కదా!" అన్న దామె.

"పైగా, మనస్సులో ఉన్నది పైకి చెప్పేస్తే గుండెలోని భారం కొంతైనా తగ్గుతుంది."

"నిజమేరోయ్! ఇ దో మంచి పాయింటే!" అన్నాడు వెంకటరావు ఆమె వైపు క్రీగంట చూస్తూ. ఆమె వెంకటరావుకి ఓ చిన్న నవ్వు పారేసింది. కాస్సేపు పోయాక, "ఊఁ! మొదలు పెట్టండి" అన్నది నన్ను హెచ్చరిస్తూ.

"బాగా పొద్దుపోయింది. పడుకో కూడద్రా?" అని కిందనుంచి వాళ్ల అమ్మ కేక వేసింది.

"నీ కంత ఉడుకుమోతుతనంగా ఉంటే నువ్వుకూడా ఇక్కడికి రారాదూ?" అన్నాడు సుబ్రహ్మణ్యం తండ్రి, నాకు కొస్త దగ్గిరగా జరుగుతూ. ఆమెకూడా నవ్వుకుంటూ వచ్చి ఆయన పక్కన కూర్చుంది.

"ఇక లాభం లేదు. ఉచ్చులు బాగా బిగించుకున్నాయి. చెప్పక తప్పదా?" అన్నాను.

"ఎందుకోయ్ అంత మురిపిస్తావు?" అన్నాడు వెంకటరావు. నే నో సిగరెట్టు దమ్ము లాగి ప్రారంభించాను.

* * *

"ఈ సంఘటన కిందటి వేసంగి సెలవుల్లో జరిగింది. మా ఊళ్లో అమ్మవారి జాతర అయింది. ఆ జాతరకి ఒక పల్లెటూరు ఆసామీ —మాకు దూరపు బంధువు ఒకాయన— మా ఇంట్లో మకాం పెట్టాడు. మా నాన్నగారు చుట్టలు జోరుగా కాలుస్తారు. అతనూ కాలుస్తాడు. ఇంకేం? చుట్టలమీద చుట్టలు కాల్చుకుంటూ, ఇద్దరూ మమకారాలు బాగా పెంచుకున్నారు. పర్యవసానం ఏమిటంటే, జాతర పూర్తి అయ్యేరోజున ఆయన కో ఆలోచన తట్టింది.

'బావగారూ! ఈ మన స్నేహం ఇలా సంబరాలతోనేకాక శాశ్వతంగా ఉండిపోవాలని నా కోరిక. నా కో బంగారపు బొమ్మలాటి కూతురు ఉంది. ఈడూ జోడూ బాగుంటుంది. మీ కభ్యంతరం లేకపోతే మీ అబ్బాయిని వచ్చి చూసుకోమనండి. పిల్లలిద్దరూ ఒకరి కొకరు ఇష్టపడితే, వచ్చే ఏడు మీ అబ్బాయి పరీక్షలై పోగానే పెళ్లి చేసేద్దాం. ఏమంటారు?' అన్నాడు.

మా నాన్నగారు కొస్త గాభరా పడ్డారు. ఎందుకంటే ఆయన చాలా ఆస్తిపరుడని ప్రతీతి. మాకు స్వంత కొంపకూడా లేదు. మా కున్న ఆస్తి అంతా నా చదువు ఒక్కటే.

'మీరు పరిహాసా లాడుతున్నారు, బావగారూ! లేకపోతే మీ రెక్కడ, మే మెక్కడ? మీతో వియ్యమందే తాహతు మాకు లేదు' అన్నారు మా నాన్నగారు. ఆ మాట కాయన తారాజువ్వ లాగు లేచాడు.

'మీ కేమిటి లోటండీ? సంప్రదాయంగల కుటుంబం. రత్నం లాంటి కొడుకు! మీ రిక నేం మాట్లాడడానికి వీల్లేదు. నే నబ్బాయిని తీసుకుపోతున్నా నంతే!' అన్నాడు.

"అబ్బ! కలే నిజమైతే? ... జలకాలాటలలో . . . మరి, ఎంత హాయిలే కల!"



చిత్రం—భాస్కర్ కుమార్ (కరీంనగర్)

అంతే! ఇక ఏమనడానికి నేను మాత్రం ఎవణ్ణి? ఏమవుతూందో ఆలోచించుకునే లోపల ఆయనతో రైలుబండిలో కూర్చున్నాను."

"నేను మబ్బులో బండి ఎక్కినట్టు" అన్నాడు వెంకటరావు. రాజేశ్వరి కిసుక్కున నవ్వింది.

"వెంకట్! అడ్డుపుల్ల వెయ్యకు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అబ్బ! ఉండండ్రా. ఆ అబ్బాయిని చెప్పనివ్వండి" అన్నది తల్లి.

నేను మరో సిగరెట్టు వెలిగించు కొని ప్రారంభించాను.

"ఆయనో తమాషా అయిన మనిషి. వయస్సులో నా కన్న ఓ పాతిక ముప్ఫై సంవత్సరాలు ఎక్కువ ఉన్నవాడైనా, మనస్సులో నాతో సరిసమానంగా తూగేవాడు. రెండు మూడు స్టేషన్‌లు దాటాక పెద్దవాళ్లంటే చిన్నవాళ్ల కున్న బిడియం పోగొట్టాడు. నా సిగరెట్లకి తనే నిప్పుపుల్ల అంటించి పెట్టేవాడు. వాళ్ల ఊరు చేరేదాకా ఏవేవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు. నన్ను అయస్కాంతంలా ఆకర్షించాడు. అదో పల్లెటూరని చెప్పాగా. రైలుప్రయాణం తరవాత బస్సు ప్రయాణం. తరవాత ఒక మైలు కాలి నడక. అయినా, నాకు కష్టమనిపించలేదు. వాళ్ల ఊరు చేరు కునేసరికి సాయంత్రం అయింది. అతని ఇల్లు దగ్గిరికి వచ్చేసరికి, 'అదే, మా ఇల్లు' అని చూపించాడు. అది ఇల్లేమిటి? చుట్టూ పెద్ద ప్రహరీ గోడ ఉంది. ఆ లోగిలిలో బోలెడు కొబ్బరిచెట్లు. ఆ సాయం సమయం బంగారు రంగులో, కొబ్బరి మట్టల సందుల్లోనుంచి చిత్రకారుడి కుంచెలోనుంచి వచ్చిన ఊహాకల్పనలా కనిపించింది అతని భవనం."

"కవిత్వంలోకి దిగేడ్రోయ్!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఉష్. అడ్డు పడకండి!" అన్నాడు వెంకటరావు.

నే నప్పటికి పూర్తి దోరణిలోకి వచ్చేశాను. ఇక ఒకరు ఆపినా ఆగే వాక్ప్రవాహం కా దది.

"నిజం చెప్పద్దూ? నాకు చెమటలు పట్టేశాయి. కలయో, వైష్ణవ మాయయో అన్నట్టుంది నా పని. ముసలాయన నామీద దేన్నైనా ప్రాక్టికల్ జోక్ ప్రయోగించడం లేదు కదా అనిపించింది. మా వెనకాల అప్పుడే నలుగురైదుగురు పాలేర్లు వినయంగా దండాలు పెడుతూ నడవడం ప్రారంభించారు. ఎవరో ముందుగా పరిగెత్తి, ఇంట్లో మేం వస్తున్నట్టు చెప్పారు. వాళ్ల ఇంటి అరుగులు ఎక్కుతుంటే,

కాళ్ళు కడుక్కోవడానికి ఒకడు నీళ్ళ చెంబు అందించాడు. మరొకడు ముఖం కడుక్కోడానికి సబ్బు అందించాడు. మూడవవాడు తువ్వాలు పట్టుకుని నిల్చున్నాడు. అతని భార్య తలుపు చాటున నిల్చొని, అన్ని మర్యాదలు స్వయంగా తణిఖీ చేసింది. రాత్రి భోజనం చేసి ఆరుబయట పడు కుంటే, కాళ్ళు పిసకడానికి ఒకడు తయారు. నాకు కాళ్ళు పిసికించుకునే అలవాటు లేదని వాణ్ణి తరిమేసరికి తలప్రాణం తోకకి వచ్చింది.

మరునాడు అమ్మాయిని చూపించారు. ఎలాగుందంటారు? నేను రంభనీ, ఊర్వశినీ చూడలేదు. కాని, వాళ్ళు ఆమె కంటె అందమైన వాళ్ళంటే నే నొప్పుకోను."

"మా రాజీకంటె బాగుంటుందా?" అన్నాడు సుబ్రహ్మణ్యం. నేను నవ్వుతూ రాజేశ్వరివైపు చూశాను.

"రాజేశ్వరి కన్నా బాగుంటుంది" అన్నాను.

రాజేశ్వరి బుంగమూతి పెట్టింది.

"మీ రలా ఉడికించినా నేను ఉడుక్కోనులెండి" అంది. వెంకట రావు లేచాడు.

"ఏదీ నా కరవాలము? ఈ వాచా లుని నాలుక చీల్చివేసెదనుగాక!" అన్నాడు సుబ్రహ్మణ్యం, వెంకటరావుని కూర్చోబెడుతూ.

"బావా! శాంతింపుము, శాంతింపుము: ఈ నీడికి రేపొద్దున్న ఫలహారం, కాఫీ లేకుండా ప్రతీకారం తీర్చుకుంటుందిలే" అన్నాడు.


"అబ్బ! ఉండండ్రా మీ గోల మీరూ. కథ మంచి రక్తిలోకి వస్తుం టేనూ!" అని తల్లి మళ్లీ హెచ్చరిం చింది. నేను మళ్లీ అందుకున్నాను.

"ఆమెను చూడగానే నా మతి పోయింది. సభ్యతనీ, సహజమైన వియ మాల్నీ మరిచిపోయి ఆమె వెనకాల మార్యుడిచుట్టూ తిరిగే గ్రహం లాగు, చంద్రుడికోసం తపించే చకోరంలాగు, కాంతిచుట్టూ ఎగిరే దీపంపురుగు లాగు. . ."

"సరిసరి. ఇక బోధపడిపోయింది. తరవాత, తరవాత" అన్నారు సుబ్రహ్మణ్యం నాన్నగారు.

"ఇక మీరూ వాళ్లతో కలిశారూ? అయితే తెల్లవారిపోతుంది" అన్నది తల్లి.

"వాళ్లింట్లో వారం రోజు లుంటా నని అనుకున్నవాణ్ణి నెల రోజులు మకాం వేశాను. ఈ నెల రోజుల లోను వాళ్ల కుటుంబంలో ఒకణ్ణిగా




చిత్రం – సుధామ (హైదరాబాదు–36)


మసిలాను. ఆయనా, నేనూ కలిసి ఎంత చనువుగా తిరిగామో చెప్పడానికి లేదు. పల్లెటూరివాడైనా చాలా అభ్యుదయ భావా లుండేవి. వాళ్ల అమ్మాయికి నేను మల్లెపూలు కోసి అందించినా, ఆమెతో ఏవేవో పిచ్చి పిచ్చి కబుర్లు చెప్పినా, ఆమెచేత తాగ డానికి మంచినీళ్లు తెప్పించుకున్నా చూసీచూడనట్టు ఊరుకునేవాడు కాని, అభ్యంతరం చెప్పేవాడు కాడు. నేను చెబితే మీరు నవ్వుతారు. నమ్మరు. కాని అతను, నేను కలిసి మామిడి చెట్లెక్కి కాయలు కోసుకుని ఉప్పు తోను, కారంతోను తినేవాళ్లం. ఒక నాడు నా కాలిలో ముల్లు గుచ్చు కుంటే తనే స్వయంగా నా పాదాన్ని తన ఒళ్లో పెట్టుకుని ముల్లు తీశాడు."

నేను కొన్ని సెకండ్లు ఆగి, మరో సిగరెట్టు వెలిగించుకున్నాను.

"ఒకసారి నాకు ఆమెతో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరికింది. ఒకనాటి వెన్నెల రాత్రి ఏదో హరికథ అవుతూంటే అమ్మా, నాన్నా వెళ్లారు. నాకు హరికథలంటే తలనొప్పి. అందు చేత నేను వెళ్లలేదు. ఆమెకూడా వాళ్ల వెంట వెళ్లబోతూంటే, 'బాతా ఖానీ వేద్దాం, వెళ్లద్దు' అన్నాను. ఆమె తండ్రివైపు చూసింది. ఆయన గారాబంగా 'హరికథలు మావంటి ముసలివాళ్లకు గాని మీ పడుచు వాళ్ల కెందుకూ? ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకోండి. మేం వేగంగానే వచ్చేస్తాం' అన్నాడు.

ఆమె ఉండిపోయింది. వాళ్లు వెళ్లారు."

చిత్రం – సుధామ (హైదరాబాదు–36)




సుబ్రహ్మణ్యం తెచ్చిపెట్టుకున్న దగ్గు దగ్గాడు.

"చలి వేస్తూంది రా. రాజీ, అట్టే సేపు ఇలా మంచులో కూర్చుంటే నీకు రొంప చేస్తుంది. నీ గదిలోకి పో" అన్నాడు.

"అబ్బా! నువ్విప్పుడు వెయ్యి రూపాయ లిచ్చినా నే నిక్కడనించి కదిలేది లేదు" అన్నది రాజేశ్వరి.

"ఏం ఫరవాలేదు. సెన్సార్ల అవసరం లేకుండానే కథ చెబుతాను" అన్నాను.

"పాలేరు మండువాలో ఒక మంచం వేశాడు."

"తరవాత వాణ్ణి సిగరెట్టు పాకెట్ తెమ్మని పొరుగూరు పంపిం చేశావు" అన్నాడు వెంకటరావు.

"చ చ! అటువంటి తప్పుడు పనులు చేస్తానా? మంచంమీద నేను కూర్చున్నాను. అరుగుమీద ఆమె కూర్చుంది. కొన్ని జానపద చిత్రాలు చూశాక, అప్పుడప్పుడు ఆ రాత్రి మనకి తియ్యని కలలు వస్తాయి. ఆ కలలో మన మేదో మురళి లేక వీణ వాయిస్తాం. అప్పుడో మబ్బుల తెరలోనించి అలా అలా తేలుతూ ఒక నవయౌవన అప్సర మన దగ్గిరికి వచ్చి చిరునవ్వులు చిందుతూ, 'నరుడా, ఏమి నీ కోరిక?' అంటూ నిల్చుం టుంది. అటువంటి అనుభూతి కలిగింది నాలో ఆ రాత్రి. వాళ్లు హరికథనించి వచ్చేదాకా ఆమెతో ఏవేవో మాట్లా డాను. ఆమె అన్నిటికీ అప్పుడే కరిగి ప్రవహించే మంచునీటి సెలయేరు లాగు గలగలమని శ్రుతి కలిపింది. 'నేను నీతో ఏవేవో పేకమేడలు కడు తున్నాను. నేను వెళ్లిన తరవాత కూల ద్రోయవుకదా!' అన్నాను. 'కూలదోయ డానికి ఏదైనా గాలి వస్తే అడ్డుగా తన చీరకొంగు ఉంచుతా' నంది."

"వింటున్నావా? ఇవన్నీ నీ ముందుజాగ్రత్తకి" అన్నాడు సుబ్రహ్మణ్యం రాజేశ్వరితో.

"కాబోయే మొగుడు ఇంజనీరు అయినప్పుడు ఇటువంటి కవిత్వం ప్రతి ఆడదానికీ వస్తుంది, అగ్రజా!" అన్నది రాజేశ్వరి.

"ఉడుకుమోతా!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఊఁ!" అని ఆమె నాలిక బయట పెట్టి వెక్కిరించింది.

"అబ్బబ్బ! ఒకటే కాకిగోల! వినివ్వరు కదా! నువ్వు కానియ్యి, అబ్బాయ్!" అన్నది తల్లి.

నేను మళ్లీ మొదలెట్టాను.

"మరొకనాడు ఒక ప్రమాదమైన సంఘటన జరిగింది. వీళ్ల గ్రామం పక్కన దొంగఏరు ఒకటుంది. ఇద్దరం ఏదో పొరుగూరు వెళ్లి ఏటిలోని ఇసకలో నడిచి తిరిగి వస్తూంటే ఎక్కణ్నుంచి వచ్చిందో కొన్ని క్షణాల్లో చెవులు దద్దరిల్లేలాగు శబ్దం చేసుకుంటూ ఏరు వచ్చేసింది. అతనికి ఈత వచ్చుగాని, ఆ ప్రవాహానికి తట్టుకోలేకపోయాడు. నేను మాత్రం అతణ్ణి వదిలి పెట్టలేదు. ఇద్దరి బరువుతో అలా ఎంతసేపు ఈదానో జ్ఞాపకం లేదు. నేనుకూడా అలిసిపోయి నీటిలో మునకలు వేయబోయేసరికి ఒక చెట్టుకొమ్మ తేలుతూ మా దగ్గిరికి వచ్చింది. దాన్ని పట్టుకుని ఎలాగో ఒడ్డున పడ్డాం. అలా ఎంతసేపు పడి ఉన్నామో గాని, మేం తెప్పరిల్లేసరికి ఏరూ లేదు, ఏరూ లేదు. మళ్లీ ఏటి ఇసకా, మేమూ మిగిలాం. ఇంత పెద్దవాడూ నన్నొక్కసారి కావిలించుకొని ఏడ్చాడు. ఆ దగ్గిరలో ఏదో ఊరు ఉంది. కనుక్కుంటే మేము పది పన్నెండుమైళ్ళ నీట్లో కొట్టుకొని వచ్చేశాం. ఆ రాత్రికి అక్కడ విశ్రాంతి తీసుకొని, మరునాడు వాళ్ల ఊరికి పోయాం.

ఈ సంఘటనతో మే మిద్దరం మరింత చేరువగా వచ్చాం. మరో వా[రం] రోజులకి నేను మా ఊరు వచ్చేశా[ను]. [నే]ను బయలుదేరే రోజు నాకు వీడ్కోలు ఇవ్వడానికి అతని భవనానికి గ్రామమంతా వచ్చారు. అతడు నాతో బస్సుస్టాపుదాకా వచ్చి, నన్ను బస్సెక్కించి, కళ్ల నీళ్ల పెట్టుకొని ఒత్తుకుంటూ తిరిగి వెళ్లాడు."

నేను మరో సిగరెట్టు వెలిగించుకున్నాను. రెండు మూడు దమ్ములు లాగాను. తరవాత తాపీగా అన్నాను:

"అంతే! నాటికి నేడు ఆయన దగ్గిరనుంచి మరి ఉత్తరం లేదు."

"ఆఁ!" అన్నా రంతా.

"ఆఁ" అన్నాను నేను.

కాస్సేపటివరకు ఎవ్వరూ మాట్లాడలేదు. తరవాత "నువ్వు మాతో తమాషాలాడుతున్నా వబ్బాయ్!" అన్నారు సుబ్రహ్మణ్యం తండ్రిగారు.

"లేదండి. తమాషా అయినా బాగుండును. నే నెన్నో ఉత్తరాలు రాశాను. మా నాన్నచేత రాయించాను. ఒక పెద్దమనిషిచేత కబురు పెట్టాను. ఆయన దేనికీ సమాధానం ఇవ్వలేదు. నాలుగయిదు నెలల తరవాత ఆ అమ్మాయికి పెళ్లికూడా చేసేశాడని వార్త వచ్చింది. నా మీద ఎందు కింత నిర్దయతో ప్రవర్తించాడో, నేను చేసిన ఏ అపరాధానికి నన్నిలా శిక్షించాడో నా కీ రోజునకూడా తెలియదు."

నా గొంతు బొంగురుపోయింది. రాజేశ్వరి కిందికి వెళ్లి, కాఫీ చేసి అందరికీ ఇచ్చింది. ఈలోపున ఈ విషయంమీద చాలా తర్జనభర్జనలు జరిగాయి. కాని, సరిఅయిన సమాధానం ఎవ్వరూ చెప్పలేకపోయారు.

• • •

అప్పుడప్పుడు మనకి అనిపిస్తూంటుంది ప్రపంచం ఇంత చిన్నదిగా ఎందుకు ఉందీ అని. నా విషయంలోనూ అలాగే జరిగింది. ఏ వ్యక్తినైతే నేను మరిచిపోవడానికి ప్రయత్నిస్తున్నానో, మళ్లీ ఈ జన్మలో కలుసుకో మనుకున్నానో ఆ వ్యక్తి నా కళ్ల ఎదురుగా మళ్లీ సాక్షాత్కరించింది. వెంకటరావుకీ, రాజేశ్వరికీ పెళ్లి జరుగుతున్న రోజున పెళ్లిపందిరిలోకి అందరినీ ఆహ్వానిస్తున్నాం నేనూ, సుబ్రహ్మణ్యం. హఠాత్తుగా వాళ్లు నాకు కనిపించారు. అదే నవ్వు, అదే నోట్లో చుట్ట, అవే కిర్రుచెప్పులు — మా వైపు వస్తున్నాడతను. పక్కనే భార్య ఉంది. వెనకాల అమ్మాయి నడుస్తోంది. ఆమె పక్కగా ఒక చిన్న గొడుగేదెలాగు ఉన్న మనిషి ఒకడు నడుస్తున్నాడు. నల్లగా ఉన్నవాళ్లని నేను నిత్యం చూస్తూనే ఉంటాను. కాని, అంత కారునలుపు నే నెప్పుడూ చూడలేదు. చిన్న నుదురు, కుంకుడు గింజల్లాంటి చిన్నకళ్లు — కాస్త లోతుగా ఉన్నాయి. పొకిరిపోయిన ముక్కు. దళసరి పెదవులు. గడ్డం కాస్త మాసి ఉంది. నుదురు, ముక్కు తప్పించి ఆ ముఖం మీద వెంట్రుకలు లేని జాగా లేదు. చెవులలోంచికూడా అవి దట్టంగా పొడుచుకొని మొలిచాయి. అతడి నోట్లో కూడా ఒక చుట్ట ఉంది.

ఇద్దరం ఒకరినొకరం కాస్సేపు ఆశ్చర్యంగా చూసుకున్నాం. ముందు ఆయనే తేరుకున్నాడు. నోట్లోనించి చుట్ట తీసి కొడి దులుపుతూ, "ఏం వోయ్, కృష్ణమూర్తీ! బాగున్నావా?" అన్నాడు నవ్వుతూ. నేను నవ్వలేదు. ఆయనకి సమాధానం ఇవ్వలేదు.

"ఆశ్చర్యంగా ఉందే! మా స్నేహితుడు మీ కెలా తెలుసు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"బాగా తెలుసునోయ్. మీ నాన్న ఎక్కడ?" అన్నాడు సుబ్రహ్మణ్యం వైపు తిరిగి.

"పదండి, తీసుకువెళతాను."


వాళ్ళ సుబ్రహ్మణ్యం వెంట పందిరిలోకి వెళ్లారు. తల్లి, కూతురు వంచిన తలలు ఎత్తలేదు. నా వైపు చూడలేదు. అల్లుడివైపు మరోసారి కుతూహలంగా చూశాను. పందిరిలో కుర్చీలు సర్దుతున్న ఒక పంపులు తిరిగిన పనిమనిషివైపు దీక్షగా చూస్తున్నాడు చుట్ట నములుతూ.

సుబ్రహ్మణ్యం తిరిగి రాగానే అడిగాను వాళ్ల బంధుత్వం.

"నా మేనత్త మొగుడు. ఆమె పెళ్లయిన అయిదారు సంవత్సరాలకి పోయింది. ఆమెకి పిల్లలు లేరు. తరవాత ఈమెని చేసుకున్నాడు. వీళ్ళు నీ కెలా తెలుసు?" అన్నాడు.

"ఆ అమ్మాయే నా స్వప్నసుందరి. వాడే నా కథలోని విలన్" అన్నాను.

"తమాషాగా ఉందే! ఎంత విచిత్రం!" అన్నాడు సుబ్రహ్మణ్యం.



రథ చక్రాలొస్తున్నా యొస్తున్నాయి"

ఫొటో—ఎ. విశ్వనాథ్ (మద్రాసు-4)

మధ్యాహ్నం భోజనాల దగ్గిర నేను కూర్చున్న దగ్గిరికి వచ్చా డతను.

"మనం ఇద్దరం కలిసి భోజనాలు చేసి సుమారు సంవత్సరం అయింది. ఇవాళ మళ్లీ నీతో భోజనం చెయ్యాలని మనసు పుట్టింది. ఇతడు మా అల్లుడు— బ్రహ్మానందం. అల్లుడూ! ఈ అబ్బాయి నా స్నేహితుడి కొడుకు. మనిషి తెల్లగా ఉన్నా పేరు కృష్ణమూర్తి."

"మీ రెక్కడ చదువుకున్నారండీ?" అన్నాడు అల్లుడు, మామ పక్కన కుర్చీలో కూర్చుంటూ.

"కాశీలో" అన్నాను.

"ఏ మదృష్టం, ఏ మదృష్టం" అన్నాడు అల్లుడు మామ విస్తరి మీదనించి నా వైపు వంగుతూ.

"అక్కడ దాల్‌మండీ అని ముండల వీధి ఒకటి ఉండిట. భలేగా ఉంటుందిట. కొట్టారు ధామ్సు!" అన్నాడు నాతో కీచుకీచుమని నవ్వుతూ. ఆ నవ్వు వింటే కోతికీ, మనిషికీ చాలా దగ్గిర సంబంధం ఉన్నట్టు మనకి తప్పకుండా తోస్తుంది.

"మీ రేం చదువుకున్నారు?" అన్నాను అల్లుడితో.

"చదువుకునే ఖర్మేం నాకు? నీ లాటి వాళ్లని పది మందిని ఉద్యోగాల్లో ఉంచగలను. మా నాన్న బతికి ఉన్నన్నాళ్లూ నా ప్రాణాలు తినేవాడు, 'చదువుకోరా, చదువుకోరా!' అని. 'నువ్వంతగా గోంచేస్తే పట్నంలో అయితే చదువుకుంటా' నన్నాను. పిచ్చివాడు ఒప్పుకున్నాడు. నా సామి రంగా! ఇహ చూడు మజా! మా నాన్న చచ్చేదాకా పట్నంలో ఓ వెలుగు వెలిగించాను."

నా వైపు మళ్లీ దగ్గిరగా వంగి, నా చెవిలో ఓ బూతుమాట అన్నాడు.

మామ ఒక చిన్న దగ్గు దగ్గి, "అల్లుడూ! కొంచెం సర్దుకు కూర్చో. వడ్డన మొదలైంది" అన్నాడు ఇబ్బందిగా ముఖం పెడుతూ.

మామ, అల్లుడు భోజనాలు చేసి తాంబూలం వేసుకుంటూ నిలుచున్నారు. అమ్మాయి భోజనం చేసి, తల్లితో చేతులు కడుక్కోవడానికి వెళ్లింది. నేను చప్పున ఆమె దగ్గిరికి వెళ్లి, "నీతో మాట్లాడాలి" అన్నాను.

ఆమె జవాబు చెప్పలేదు. వంచిన తల ఎత్తలేదు.

"నువ్వింత మారిపోతావనుకోలేదు. నాతో మాట్లాడడానికికూడా నీకు అసహ్యంగా ఉందా?" అన్నాను



ఎవరికోసం?

ఫోటో— జి. రూపచంద్రరావు (గుంటూరు-1)

కోపంగా.

ఆమె మెల్లిగా తల ఎత్తింది. నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ అంది: "నేనా మారిపోయాను? నీ లాటి మోసగాడితో మాట్లాడి ఏం లాభం?"

"ను వ్వన్నది నాకు బోధపడడం లేదు" అన్నాను అయోమయంగా.

"ఏమే? అక్కడెంతసేపలా తగలడ తావు? చేతులు కడుక్కోవడం ఓ గంటా?" అన్నాడు అల్లుడు దూరం నుంచి.

"పద పద. అల్లుడు కేక వేస్తున్నాడు" అన్నది తల్లి తొందర చేస్తూ. ఆమె పబ్బు తీసి చేతులు కడుక్కుంటూ, "సాయంత్రం 4 గంటలకి మా విడిదికి రండి" అన్నది వంచిన తలతో.

తల్లీ కూతుళ్లు మామా అల్లుళ్ల దగ్గిరికి వెళ్లగానే, అల్లుడు నోట్లో చుట్ట బయటికి తీసి, "పైమొగాళ్లతో నీ కేం పనే? వాడితో ఎందుకూ ఆ చొప్పదంటు బాతాఖానీ?" అని కళ్లెర్ర చేశాడు.

"అల్లుడూ! ఆ అబ్బాయి మనకి దూరపు బంధువు. ఓ సారి పలకరిస్తే తప్పా? అలా ప్రతి చిన్న విషయానికీ నువ్వు తప్పు పట్టడం మంచిది కాదు సుమా" అన్నాడు మావ.

"నీకు తెలీదు, మామా! ఈ ఆడముండల్ని అలా అణిచి ఉంచకపోతే నెత్తికెక్కి కూచుంటారు" అన్నాడు అల్లుడు కొంచెం తగ్గి. కుర్చీలు సర్దిన పని మనిషి కొంచెం దూరంలో ఒక పందిరి స్తంభానికి ఒయ్యారంగా ఆనుకుని కిసుక్కున నవ్వింది. అల్లుడు అటువైపు తిరిగాడు.

"ఏమే, అమ్మీ! ఎందు కలా పళ్లికిలిస్తున్నావ్?" అన్నాడు.

ఆమె విలాసంగా నవ్వింది.

"ఏం, బాబూ? నే నవ్వితే నీ కేం? నవ్వు గుత్తకి తీసుకున్నావా నువ్వు?" అంది.

"ఈ ముండ మాటలు నేర్చిందే!" అని అల్లుడు ఆమెని మెచ్చుకున్నాడు.

"బాబ్బాబు, ఓ సుట్టము క్కలా పారెయ్, బాబూ!" అన్నది పనిమనిషి దగ్గిరికి వచ్చి.

"ఊహూఁ! నేను నీకు చుట్టిస్తే నువ్వు నా కేటిస్తావ్?" అన్నాడు అల్లుడు దాని రొమ్ములవైపు చూస్తూ.

ఆమె జవాబు చెప్పేలోపున మావ, "ఇందే, నీ చుట్ట! ఇహ ఇక్కడినుంచి పో! అల్లుడూ, పద!" అన్నాడు.

అల్లుడు కీచుకీచుమని నవ్వాడు.

"చూశావా, మామా! దాన్నెలా చిత్తుకొట్టానో? నాతోనా సరసాలు? అయ్?" అన్నాడు మావతో.

వాళ్లు వెళ్లిపోయారు. సుబ్రహ్మణ్యంతో జరిగింది చెప్పి, వాళ్ల విడిది కనుక్కున్నాను.

రాజేశ్వరి, వెంకటరావు నేను, సుబ్రహ్మణ్యం కాంట్రాక్ట్ బ్రిడ్జి ఆడాం మధ్యాహ్నం. ఆట ఆడుతున్నంతసేపూ పరధ్యాన్నంగా ఉన్నాను. నాలుగు గంటలకి "నే నిక వెళతాను. నాలుగో చేతికి మీ నాన్నగారిని పిలవండి" అని లేచాను.

"అదేమిటి? ఎక్కడికి వెళతావ్?"

"చెప్పరా, సుబ్బూ!" అని బయలు దేరాను.

విడిదిలో నాలుగైదు కుటుంబా లున్నాయి. వీళ్ల గది కనుక్కొని లోనికి వెళ్లాను. తల్లీ కూతుళ్లు నా కోసం ఎదురు చూస్తున్నారు. నేను రాగానే, "ను వ్వాయనతో మాట్లాడు. నే నిప్పుడే వస్తాను" అని తల్లి బయటికి వెళ్లిపోయింది.

"వా ళ్లిద్దరూ ఏరీ?" అన్నాను.

"ఇవాళ ఏదో సినిమాకి మూడు గంటలాటకి వెళదాం అని పొద్దున్న ఇద్దరూ అనుకున్నారు. • అందుకే నిమ్మల్ని ఇప్పుడు రమ్మన్నాను" అన్న దామె.

గదిలో ఓ ట్రంకుపెట్టెమీద కూర్చున్నాను. ఆమె గోడ కానుకొని ఒక చాపమీద కూర్చుంది.

"ఇప్పుడు చెప్పు, ఏం జరిగింది? నన్నెందుకు మోసగాడినన్నావు?" అన్నాను.

"ఏం జరిగిందో నా కేం తెలుసు? నమ్మించి గొంతు కోసినవాళ్లని మరెలా పిలవాలేం? మా ఊళ్లో ఉన్నన్నాళ్లూ నాతో అన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పి, ఇంటికి వెళ్లగానే నేను నచ్చలేదని మా నాన్నకి ఉత్తరం రాయడం మోసం కాదూ?" అన్న దామె. ఆమెకు ఏడుపు వస్తూంది. గొంతుకలో జీర వస్తూంది.

"భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను. నే నలా రాయలేదే!" అన్నాను.

"అయితే, మా నాన్న నాతో అబద్ధం ఆడాడంటారా?"

"అంతే అయి ఉండాలి!"

"నేను నమ్మను."

"నేను గాని, మా నాన్నగారుగాని రాసిన ఉత్తరాలలో ఒక్కటైనా నువ్వు చదివావా?"

"లేదు."

"పోనీ, రామేశంగారితో కబురు పెట్టాం. ఆ సంగతేమి టంటావు?"

"ఏమిటీ? మీరు రామేశంగారితో నన్ను పెళ్లి చేసుకుంటానని కబురు పెట్టారా? అతను, 'మన జాతకాలు రెండూ పడలేదు. అందుచేత ఈ సంబంధం మాకు వద్దన్నారు' అని చెప్పాడే!"

నాకు మతి పోయినంత పని అయింది. తల వేడెక్కిపోయింది. ఈ ఆలోచనల పద్మవ్యూహంలో చిక్కుకున్న నా మెదడుకి చివరికి మార్గం కనిపించింది.

"అంటే, రామేశానికి లంచం పెట్టి వాడిచేత అలా అబద్ధం ఆడించి ఉంటాడు మీ నాన్న."

ఇద్దరం ఒకరి నొకరం అలా చూస్తూ ఉండిపోయాం. దిగ్గన లేచాను. "వస్తాను" అన్నాను.

"ఎక్కడి కలా బయలుదేరారు?" అన్న దామె.

"వెళ్లి మీ నాన్న బుర్ర బద్దలు కొడతాను" అన్నాను కోపంతో. ఆమె ఏమీ అనలేదు. న న్నలా చూస్తూ నిల్చుంది. నేను వెనుదిరిగి గుమ్మంవైపు రెం డంగలు వేశాను.

"మా నాన్నమీద పగ తీర్చుకోవ డానికి ఆయన తల పగలగొట్టే బదులు మరో పని చెయ్యచ్చు" అన్న దామె తాపీగా.

వెళుతున్నవాడిని ఆగాను. వెనక్కి తిరిగి, "ఏమిటది?" అన్నాను.

ఆమె తాపీగా వచ్చి నాకు దగ్గిరగా నన్ను ఆనుకుంటూ నిల్చుంది. నా ముఖం లోకి ముఖం పెడుతూ, "మన మిద్దరం ఈ రాత్రి ఎక్కడికైనా పారిపోవచ్చు" అన్నది మెల్లిగా, తియ్యగా.

నా కళ్లు ఎరుపెక్కాయి. రక్తం ఒక్కసారి వేడెక్కింది. నరాలు జివ్వుమని లాగుతున్నాయి. నా రెండు చేతులూ అనాలోచితంగా ఆమెను చుట్టడానికి ముందుకు వెళ్లబోయాయి. ఎలా నిగ్రహించుకున్నానో నాకే తెలియదు.

"న న్నాలోచించుకోనియ్" అని గిరుక్కున వెనుదిరిగి ద్వారం దాకా వెళ్లాను. గుమ్మం దాటుతూంటే, "ఈ రాత్రి మీ కోసం ఎదురు చూస్తూ ఉంటాను" అని నన్ని గొంతు వెనకనించి వినిపించింది. నాకు తెలియకుండానే నా తల వెనక్కి తిరిగింది.

ఆమె పైట జార్చేసింది. జాకెట్టు పైన ఒక పిన్నుకింద ఓ ముడి వేసింది. మధ్యను జాగ్రత్తపడలే దామె. వద్దంటున్నా నా కళ్లు ఆ జాగాలో నిలిచాయి. నాకు మతి పోయింది. గాఢ నిద్రలో ఏదో తియ్యని కల వచ్చి నిద్ర లోనే లేచి నడిచినట్టు విడిది బయటికి నడిచాను.

సాయంత్రమంతా గాలిదుమా రంలో ఎగురుతున్న గాలిపటంలా ఎక్కడెక్కడో యాంత్రికంగా తిరి గాను. బాగా చీకటిపడ్డాక ఇంటికి వచ్చాను. టీపార్టీ జరుగుతూంది. అందంగా అమర్చిన టేబిళ్లమీద అతిథులంతా ఫలహారాలు తింటున్నారు. వధూవరుల నిద్దరినీ ఒక సోఫాలో కూర్చోపెట్టారు. పూలదండలు వేశారు. పక్కన ఒక పరికిణీ, పల్లెవాటు వేసుకున్న అమ్మాయి, అతిథు లిచ్చిన బహుమతులన్నీ ఒక టేబిలుమీద జాగ్రత్తగా సర్దుతూంది. సుదూరంలో ఒక బాండుపార్టీ పాశ్చాత్య సంగీతాన్ని వినిపిస్తూంది. వెంకటరావు మధ్య

మధ్య రాజేశ్వరి చెవిలో ఏదో చెబుతున్నాడు. ఆమె హాయిగా చిరునవ్వుతో ఊఁ కొడుతూంది.


వాళ్లిద్దరి పీకలు పిసికెయ్యనా? వాళ్ల మెడలలోని దండలు తెంపెయ్యనా? ఆ పక్కనున్న అమ్మాయినో టెంకకాయ కొట్టి ఏడిపించనా? ఆ బాండు వాయిస్తున్నవాడి డోలు బద్దలుకొడితే? పోనీ, ఏకంగా పెళ్లిపందిరికే నిప్పంటిస్తే?


నా భుజంమీద చెయ్యి పడింది. వెనుతిరిగాను. సుబ్రహ్మణ్యం! "ఏమయింది వెళ్లిన పని?" అన్నాడు సానుభూతితో.

"ఏ కేమని చెప్పను? ఈ అఘాయిత్యం అంతా ముసలాయన చేశాడు. అమ్మాయి నా కేమీ తెలియదంటుంది."

"ఎందు కలా చేసినట్టు?"

"దట్ ఈజ్ ది మిలియన్ డాలర్ కొశ్చన్, మై బాయ్!" అన్నాను.



SISTA'S KSO 230 TE

దూరంగా ఒక టేబిలు చుట్టూ కూర్చొని ఫలహారాలు చేస్తున్నారు వీళ్ల నలుగురూ. వెంకటరావు, రాజేశ్వరి దగ్గిరికి వెళ్లి కాస్సేపు బాతాఖానీ చేశాను. తరవాత ఒక ఫలహారంప్లేటు తీసుకొని ఆ నలుగురిని ఒక కంట కనిపెడుతూ కూర్చున్నాను. ఎనిమిది గంటలకి వాళ్లు విడిదికి బయలుదేరారు. నేను వాళ్ల వెనకాలే నడిచాను. రోడ్డుమీద వాళ్లని కలుసుకున్నాను.

"ఏమోయ్, కృష్ణమూర్తీ!" అని పలకరించా డాయన.

"మీతో నేను మాట్లాడాలి. అలా కాస్సేపు ఎక్కడికైనా వస్తారా?" అన్నాను.

"దానికేం? అలాగే కానీ. మీరు వెళుతూండండి. మే మలా తిరిగి వస్తాం" అన్నాడు వాళ్లతో.

సమీపంలో ఉన్న పార్కులోకి తీసుకువెళ్లా నాయన్ని. ఇద్దరం ఒక సిమెంటు బెంచీమీద కూర్చున్నాం.

"ఇప్పుడు చెప్పండి, మా ఇద్దరి జీవితాలు ఎందు కిలా నాశనం చేశారు? పోనీ, నే నంటే పైవాణ్ణి. ఒక్కగా నొక్క కూతురు మీ అమ్మాయి ఏం చేసింది?" అన్నాను ఆవేశంతో.

ఆయన పక్క జేబులోంచి తాపీగా ఒక చుట్ట తీశాడు. దాన్ని వెలిగించి రెండు మూడు దమ్ములు లాగాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్టు జేబులో నించి మరో చుట్ట తీసి నాకు అందించబోయాడు. "నో, థాంక్స్" అని నా సిగరెట్టు పాకెట్ విప్పి, నే నో సిగరెట్టు వెలిగించుకున్నాను. తరవాత నాతో అన్నాడు:

"మీ రిద్దరూ మధ్యాహ్నం ఏమిటి మాట్లాడుకున్నారు?"

"మే మిద్దరం మాట్లాడుకున్నట్టు మీ కెలా తెలుసు?"

"చూడు, కృష్ణమూర్తీ! నేనూ నీ వయస్సులో ఉన్నప్పుడు చాటుగా మాటుగా ఆడగుంటల్ని కలుసుకుంటూ ఉండేవాణ్ణి. మీ రిద్దరూ భోజనాల దగ్గిర ఏం అనుకున్నారో ఆమాత్రం ఊహించలేనా? నేనూ, అల్లుడూ సినిమాకి వెళ్లిన తరవాత నిన్ను తప్పకుండా రమ్మని ఉంటుంది. నాకు తెలుసు. ఏమని చెప్పింది నీతో?"

చెప్పాను. చాలాసేపటివరకూ ఆయన మాట్లాడలేదు. చుట్ట ఆరిపోయింది. మళ్లీ వెలిగించుకున్నాడు.

"కృష్ణమూర్తీ! నిన్ను మళ్లీ ఇలా కలుస్తాననిగాని, నీతో ఈ

(తరువాయి 47 వ పేజీలో)



"ఎన్ని మెట్లెక్కినా కానరా వెమయ్యా...

ఫొటో—జి. వి. జి. కృష్ణ (మద్రాసు-14)

**(24 వ పేజి తరువాయి)**

ప్రస్తావన మళ్ళీ వస్తుందనిగాని నేను కలలోకూడా అనుకోలేదు. కాని, ఆ భగవంతుడు మరోలా తలపెట్టాడు. ఏం చేస్తాం? కొందరు చేసిన పాపాలకి ప్రతిఫలం వచ్చే జన్మలో అనుభవిస్తారు. నే నీ జన్మలోనే అనుభవిస్తున్నాను. మా గ్రామంలోను, చుట్టుపట్ల గ్రామాలలోను నేను వెంటపడని ఆడది లేదు. కొందరు బలహీనులు నాకు బలిఅయ్యారు. కొందరు పారిపోయారు. మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ పాడుపనులు చూడలేక నా మొదటి భార్య మంచం పట్టి, బెంగతో చచ్చిపోయింది. మళ్ళీ పెళ్లాడాను. ఈమెకి కొడుకులు పుట్టలేదు. కూతురు పుట్టింది. ఒక్కగా నొక్క కూతురు. బంగారపు బొమ్మవంటి కూతురు. దీన్ని పువ్వుల్లో పెట్టి పెంచాను. దుఃఖమన్నది ఎలా ఉంటుందో తెలియకుండా పెద్ద చేశాను. పర్యవసానం ఏమిటో తెలుసా?'' అతడు పిచ్చిగా నా వైపు చూశాడు. నా భుజాలు రెండూ పట్టుకొని ఊపాడు. ''తెలుసా, కృష్ణమూర్తీ! దానికి — నా ముద్దుబిడ్డకి — నా బంగారపు బొమ్మకి నా పోలికలు వచ్చాయి. అక్షరాలా తండ్రి పోలికలు వచ్చాయి, నాయనా! భగవంతుడి న్యాయం పరిపోయింది కదూ?

అది పెద్దమనిషి కాకముందే దాని పోకడలు బాగులేవని నా మేలు కోరినవాళ్లు కొందరు నన్ను హెచ్చరించారు. వాళ్లని తిట్టాను. మళ్లీ అటువంటి పాడుమాటలు నాతో చెబితే నాలికలు చీల్చేస్తా నన్నాను. అది పెద్దమనిషయి నెల్లాళ్ళు కాలేదు. మా గొడ్లపాకలో ఒక పాలేరుతో దొర్లుతూ నా కళ్ల పడింది. అప్పటికి గాని నా కళ్ల పొరలు విడలేదు. పొరలు విడి మాత్రం ఏం చెయ్యగలిగాను? దాని ఒళ్లంతా వాతలు పెట్టాను. చింతబరికెతో గొడ్డుని బాదినట్టు కొట్టాను. రోజుల తరబడి తిండి లేకుండా చీకటికొట్లో పెట్టాను. దాని బుద్ధి మాత్రం మారలేదు. నేను ఎంతగా శిక్షిస్తే, దాని పట్టుదల అంతగా పెరిగేది. ఒకసారి ఒక బడిపంతులుతో లేచిపోయింది. వెతికి వెతికి, ఆఖరికి ఒక పట్నంలో పట్టుకొని ఇంటికి ఈడ్చుకు వచ్చాను. నాటినుంచి మా గ్రామం చుట్టుపట్లకూడా నేను మరి తల ఎత్తుకొని తిరగలేదు. నాకు తిండి సయించలేదు. నిద్ర పట్టలేదు.

ఆఖరికి ఓ తరణోపాయం ఆలోచించాను. ఎక్కడో దూరంగా ఉన్న ఓ వెర్రివెంగళాయికి దీన్ని కట్టేసి, గుప్‌చుప్‌గా పంపించేస్తే?...ఆ ఉద్దేశంతోనే మీ ఊరికి కిందటి ఎండాకాలం అమ్మవారి సంబరాలకి వచ్చాను. వెతుకుతున్న తీగ కాళ్లకి చుట్టుకుంది. ఆ వెర్రివెంగళాయి నేను దిగిన ఇంట్లో దొరికాడు — నువ్వు!

నీకు మెల్లిగా మత్తుమందు రాసి, నిన్ను బుట్టలో పెట్టి మా ఊరు తీసుకొని వెళ్లాను. అంతా సవ్యంగానే జరిగింది. నీ అంతట నువ్వే బలిపీఠం ఎక్కావు. నీ మెడలో బలిదండ నువ్వే వేసుకున్నావు. నీ చేతితో నువ్వే కత్తి నా చేతిలో పెట్టావు. తల వంచి, 'ఊఁ! నరుకు! త్వరగా నరుకు! నేను స్వర్గానికి వెళతాను!' అన్నావు. నేను నవ్వాను. నా పెళ్లాం నవ్వింది. నా రంకు కూతురు నవ్వింది. మా గ్రామం అంతా గొల్లున నవ్వారు. కాని, దేవుడు నవ్వలేదు. దేవుడికి కోపం వచ్చింది. మనిద్దరం ఆ నాడు ఏరు దాటుతూంటే కోపంతో పొంగుకుంటూ వచ్చి నన్ను మింగెయ్యడానికి ప్రయత్నం చేశాడు. కాని, దేవుడి కోపానికీ, నాకూ మధ్య నువ్వు నిలబడ్డావు. నా ప్రాణానికి నీ ప్రాణం అడ్డువేశావు. ఆ నాటి రాత్రి ఏటిఒడ్డున కూర్చొని ఎందుకేడ్చానో నీకు బోధపడలేదు కదూ? ఎలా బోధపడుతుంది?

నాకు ప్రాణదానం చేసిన నిన్ను నే నెలా బలి చెయ్యగలను? నేను స్వార్థం కోసం ఎంత నీచానికి సిద్ధపడ్డా, అంత అధోగతి కింకా దిగజారలేదు. నాలో ఎక్కడో నిద్ర పోతున్న మానవత్వం మేలుకుంది. నాకు చీవాట్లు పెట్టింది. నేను తలపెట్టిన దుర్మార్గానికి నేనే సిగ్గుపడ్డాను. నిన్ను వదిలేశాను అక్కడితో నే నూరుకోలేదు. నన్ను ఇంత నీచానికి దింపిన నా కూతురుమీద నా పగ తిరిగింది. నా పగ తీర్చుకున్నాను. చూశావు కదా, ఆ పిశాచికి ఎటువంటి మొగుణ్ణి కట్టబెట్టానో! నన్ను క్షమించదలిస్తే క్షమించు.''

పార్కు నిశ్శబ్దంగా ఉంది. మే మిద్దరమే మిగిలాం. కాస్సేపటికి ఆయన లేచాడు. ''వస్తానోయ్, కృష్ణమూర్తీ!'' అని నా వైపు చూడకుండా కాళ్లీడ్చుకుంటూ బయలుదేరాడు.

''మీకు చాలా థాంక్స్. మీ ఆరోగ్యం జాగ్రత్త!'' అన్నాను, నా కృతజ్ఞత నంతటినీ ఆ మాటల్లో ఇముడుస్తూ. పోతున్నవాడు చప్పున ఆగాడు. వెనక్కి తిరిగి హాయిగా నవ్వాడు. పక్కజేబులో తడుముకొని రెండు చుట్టలు తీశాడు.

''చుట్ట కాలుస్తావా?'' అన్నాడు నా వైపు చెయ్యి చాస్తూ. నేనుకూడా నవ్వుతూ ఒక చుట్ట అందుకున్నాను. ★